
## ఇరీనా



# ఏజెంట్ X

## యెదుళ్ల సురేష్ రెడ్డి

**సమయం సాయంత్రం అయిదు గంటలు...**

**బెల్జియం ముఖ్యపట్టణమైన బ్రస్సెల్స్‌లోని ఆ పార్కు ముందుకు ఒక కారు వచ్చి ఆగింది. అందులో నుంచి బయటకు దూకిన పిల్లలు పెద్దగా అరుస్తూ పార్కులోకి పరుగెత్తారు. తనలోతానే చిన్నగా నవ్వుకుంటూ కారుని ఒక ప్రక్కగా పార్క్ చేసి తను కూడా పార్క్‌లోకి నడిచింది ఇరీనా. సాయంత్రం సమయం కావడం వల్ల పార్క్ మొత్తం పిల్లలతో సందడిగా ఉంది. అక్కడక్కడా ఉన్న బెంచిల మీద కూర్చుని ఉన్న మధ్యవయస్కులు తమలో తామే ఏదో మాట్లాడుకుంటున్నారు. కొంతమంది వృద్ధులు అక్కడ ఆడుతున్న పిల్లల మధ్య నుండి అటూ ఇటూ వాకింగ్ చేస్తున్నారు.**

ఒక ప్రక్కగా ఉన్న బెంచి మీద కూర్చుని పిల్లల ఆటల్ని చూస్తున్న ఇరీనా తన ప్రక్కగా ఎవరో వచ్చి ఆగినట్టు అన్పించడంతో తలెత్తి చూసింది.

దాదాపు నలభై సంవత్సరాల వయసుండే ఒకతను నిలబడి ఉన్నాడక్కడ. ఆమె తనవైపు చూడగానే చిన్నగా నవ్వి "హాయ్" అన్నాడు.

ఆమె చిన్నగా నవ్వుతూ తను కూర్చున్నచోటు నుండి కాస్త ప్రక్కకు జరిగి అతన్ని తన ప్రక్కన కూర్చోమన్నట్టుగా సైగ చేసింది. తన చేతిలోని కవర్ని ఆమెకు అందించి ఆమెతోపాటే బెంచిపైన కూర్చున్నాడతను. ఆమెతో వచ్చిన పిల్లలు అతన్ని చూడగానే దగ్గరకు వచ్చి "హలో అంకుల్" అంటూ పలకరించి తిరిగి గంతులు వేస్తూ అవతలికి వెళ్లిపోయారు.

బ్రస్సెల్స్‌లోని ఒక ఆఫీసులో క్లర్కుగా పని చేస్తున్న ఆ బెల్జియం జాతీయుని పేరు పాల్ వెకెన్. మూడున్నర సంవత్సరాలుగా అతనికి ఇరీనాతో పరిచయం ఉంది. ప్రతిరోజూ పార్కుకు వచ్చి ఇరీనాతోనూ పిల్లలతోనూ ఆడుకోవడం అతనికి చాలా కాలంగా అలవాటు. ఎప్పటిలాగే ఆ రోజు కూడా వాళ్లిద్దరూ ఆ పిల్లలతో కలిసి చాలాసేపు గంతులు వేశారు. ఆడినంతసేపు ఆడి ఆ తరువాత అందరూ అక్కడి బెంచిపైన చతికిలబడ్డారు.

తను తెచ్చిన బ్యాగ్‌ని తెరిచి అందులో ఉన్న సాండ్‌విచ్‌లను అందరికీ ఇచ్చింది ఇరీనా. తనవంతుగా వచ్చిన మూడు సాండ్‌విచ్‌లలో కేవలం ఒకటి మాత్రమే తిని మిగిలిన రెండింటినీ తన వద్ద ఉన్న కవర్లో పెట్టేసుకున్నాడు వెకెన్. అదే కవర్లోంచి తను తెచ్చిన కేకు ముక్కల్ని తీసి పిల్లలతో పాటు ఇరీనాకు కూడా ఇచ్చాడు. పిల్లలు వాటిని ఆత్రంగా తినేశారు. ఇరీనా మాత్రం అతను తనకిచ్చిన నాలుగు కేకు ముక్కల్లో ఒకదాన్ని తిని మిగిలిన మూడింటినీ బ్యాగులో పెట్టుకుంది. మరో అరగంట సేపు అక్కడ కూర్చుని అందరూ బయలుదేరడానికి సిద్ధమయ్యారు. పార్కులోంచి

బయటకు రాగానే పిల్లలతో సహా ఇరీనా వెళ్లింది. పాల్‌వెకెన్ మరోవైపు వెళ్లిపోయాడు.


పాల్‌వెకెన్ తినకుండా దాచుకున్న సాండ్‌విచ్‌లలో మైక్రో ఫిల్ముల దాగి ఉన్నాయనీ, ఇరీనా తన బ్యాగులో పెట్టుకున్న కేకు ముక్కల్లో సీక్రెట్ ఇన్ఫర్మేషన్ దాచి ఉందనీ వాళ్లిద్దరికీ తప్ప ఆ పిల్లలకు గానీ, అక్కడ పార్కులో ఉన్న మరెవరికి గానీ తెలియదు.

1916 అక్టోబర్‌లో రుమేనియా తండ్రికి, జార్జియన్ తల్లికి జన్మించిన ఇరీనా పూర్తిపేరు ఇరీనా సొల్టనోవన. స్కూలు చదువులో ఫ్రెంచి భాషను తన ఇష్టమైన సబ్జెక్టుగా ఎన్నుకున్న ఆమె ఆ తరువాత మాస్కో హౌస్‌లో ఫ్రెంచి అనువాదకురాలిగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి ఆ తరువాత అక్కడి రేడియో సెంటర్‌లో చేరింది. అక్కడి నుండి రష్యా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ఉద్యోగాన్ని సంపాదించుకుని ఆ తరువాత కొద్ది రోజుల్లోనే అందులోని ఫ్రెంచి విభాగపు అధికారికి అసిస్టెంట్‌గా నియమితురాలైంది.

ఫ్రెంచి భాషలో ప్రావీణ్యం కలిగి ఉన్న ఇరీనా త్వరలోనే అక్కడి అధికారుల్లో మంచి పేరు సంపాదించుకుంది. అందమూ, తెలివీ, అంతకు మించిన ధీరత్వమూ కలిగిన ఆమె రష్యా ఇంటిలిజెన్స్ వర్గాల దృష్టిలో పడటానికి ఎక్కువ రోజులు పట్టలేదు. రెండవ ప్రపంచ యుద్ధం పూర్తయిన తరువాత వివిధ దేశాల్లో తమ గూఢచారవలయాన్ని పెంపొందించుకోవాలని రష్యా అధినేత స్టాలిన్ ప్రయత్నిస్తున్న తరుణంలో అక్కడి ఇంటిలిజెన్స్ వర్గాలు ఇరీనాను తమ గూఢచారిణిగా పని చేయాల్సిందిగా ఆహ్వానించాయి. ఆ ఆహ్వానాన్ని ఆమె మనస్ఫూర్తిగా అంగీకరించింది. తన ఇరవైతొమ్మిది సంవత్సరాల వయసులో రష్యా సీక్రెట్ సర్వీస్‌లో చేరిన ఆమె ఆ తరువాత రెండు సంవత్సరాలపాటు గూఢచర్యంలో శిక్షణ పొందింది. శిక్షణ పూర్తయిన వెంటనే 'రెసిడెంట్ నెట్‌వర్క్ ఆపరేటర్‌గా పని చేయాల్సిందిగా రష్యా సీక్రెట్ సర్వీస్ 'మేడమోసెల్లె జెర్మైన్' అన్న మారుపేరుతో ఆమెను ఫ్రాన్స్‌కి పంపించింది. (ప్రభుత్వంలో గాని ఇతర వర్గాల్లోగాని మంచి పరపతి కలిగి ఉన్న వ్యక్తుల ఇంటిలో పనిమనిషిగా చేరి అక్కడి నుండి రహస్యాల్ని సేకరించేవారిని రెసిడెంట్ నెట్‌వర్క్ ఆపరేటర్ అంటారు.)

మారుపేరుతో ఫ్రాన్స్‌కు చేరుకున్న ఆమె కొద్దిరోజుల పాటు చిన్న చిన్న ఉద్యోగాలు చేసి చివరకు పారిస్‌లోని ఒక బెల్జియం కుటుంబంలో సేవకురాలిగా పనికి కుదిరింది. బెల్జియంలోని ఉక్కు కర్మాగారానికి పారిస్‌లో ప్రతినిధిగా పని చేస్తున్న ఆ కుటుంబ సభ్యుల్లో త్వరలోనే ఆమె మంచిపేరు తెచ్చుకుంది. ఆమెను ఒక సేవకురాలిగా కాకుండా తమ కుటుంబంలో ఒకదానిలా చూసుకునే ఆ బెల్జియం కుటుంబం ఇరీనా గూఢచర్య కార్యకలాపాలకు అనువైన ప్రదేశంగా మారింది. ఆ ఇంట్లో తరచూ జరిగే పార్టీలకు ఫ్రాన్స్, పశ్చిమ యూరోపియన్ దేశాలకు చెందిన ఎందరో రాజకీయ నాయకులు, వ్యాపార వేత్తలు, ప్రభుత్వాధికారులూ, శాస్త్రజ్ఞులూ, వివిధ రంగాలకు చెందిన టెక్నాలజిస్టులు అతిధులుగా హాజరయ్యేవారు. అతి శక్తివంతమైన మైక్రోఫోన్‌ల సహాయంతో వారి సంభాషణలను మొత్తం రికార్డు చేసేది ఇరీనా. తరువాత ఆసమాచారాన్నంతా కోడ్‌లోకి మార్చి హెడ్ క్వార్టర్స్‌కి పంపించేది. అంతటితో ఊరుకోకుండా రష్యా సీక్రెట్ సర్వీస్ ఆదేశాల మేరకు ఆమె బెల్జియంలో మరో రష్యా స్పై నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. తను నియమించిన ఏజంట్లను ఎంతో తెలివిగా అక్కడి మిలటరీ, రీసెర్చ్, ప్రభుత్వ, పారిశ్రామిక విభాగాల్లోకి ప్రవేశపెట్టింది. వారిద్వారా సంపాదించిన ప్రభుత్వ పథకాల్ని, మిలటరీ రహస్యాలని, బ్లూ ప్రింట్స్, డాక్యుమెంట్స్, కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్స్ లాంటి అత్యంత కీలకమైన రహస్యాలన్నింటినీ ఎవరికీ అనుమానం రాని విధంగా మైక్రోఫిల్ములుగా మార్చి రష్యాకు చేరవేసేది.

రహస్యాల్ని చేతులు మార్చడానికి ఆమె తెలివైన పథకం వేసింది. తను పని చేస్తున్న ఇంటిలోని పిల్లల్ని తీసుకొని ఆమె రోజూ సాయంత్రం పార్క్‌కు వెళ్లేది. బ్రస్సెల్స్‌లోనే ఒక ఆఫీసులో క్లర్క్‌గా పని చేస్తున్న మరో రష్యా ఏజంటు పాల్‌వెకెన్ కూడా అదే పార్కుకు వచ్చేవాడు. చూసేవారికి అనుమానం రాకుండా వారిద్దరూ పిల్లలతో కలిసి చాలాసేపు ఆడేవారు. చివరికి వెళ్లిపోయేముందు తను తెచ్చిన సాండ్‌విచ్‌లని అందరికీ ఇచ్చేది ఇరీనా. పాల్‌వెకెన్ కేకుల్ని తీసుకొచ్చేవాడు. ఆ విధంగా తను సేకరించిన సమాచారన్నంతా మైక్రోఫిల్ములుగా మార్చి వాటిని సాండ్‌విచ్‌ల మధ్యలో పెట్టి ఆమె పాల్‌వెకెన్‌కు అందించేది. అతను తెచ్చిన కేకు ముక్కల్లో ఆమెకు అవసరమైన సమాచారం దాగి ఉండేది.




దాదాపు నాలుగు సంవత్సరాలపాటు ఆమె విజయవంతంగా తన గూఢచర్యాన్ని నిర్వహించిన తరువాత గానీ బెల్జియం ఇంటిలిజెన్స్ వర్గాలు జరుగుతున్న విషయాన్ని పసిగట్టలేకపోయాయి. ఆమెపైన నిఘావేసిన ఇంటిలిజెన్స్ వర్గాలకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఆమె పాల్‌వెకెన్‌ని కలుసుకోవడం అనుమానాన్ని కలిగించింది. ఆ పార్కులో తప్ప వారిద్దరూ మరెక్కడా కలుసుకోకపోవడం, పైగా తాము తెచ్చిన కేకుల్ని, సాండ్‌విచ్‌లను తినకుండా దాచుకుని తీసికెళ్లడం వారి అనుమానాన్ని మరింత పెంచింది. ఆమె గూఢచర్యం నిర్వహిస్తుందని పూర్తిగా ధ్రువీకరించుకున్న బెల్జియం ఇంటిలిజెన్స్ ఆమెతో సహా పాల్‌వెకెన్‌ను కూడా అరెస్టు చేసింది. మైక్రోఫిల్ములుగా మార్చబడిన ప్రభుత్వ, మిలటరీ, శాస్త్ర, సాంకేతిక రంగాలకు చెందిన ఎన్నో కీలకమైన రహస్యాలు వారి దగ్గర ధొరికాయి. వారు అందించిన సమాచారం ఆధారంగా బెల్జియమ్‌లోని రష్యా స్పై నెట్‌వర్క్ ఏజెంట్లందరిని ఇంటిలిజెన్స్ వర్గాలు అరెస్టు చేశాయి.

ప్రపంచంలోని మరే ఇతర గూఢచారిణులకు తీసిపోని ప్రమాదకరమైన గూఢచారిణి ఇరీనా. గూఢచార రంగంలోకి అడుగుపెట్టిన కేవలం నాలుగు సంవత్సరాల్లోనే ఫ్రాన్స్, బెల్జియంలకు చెందిన ఎన్నో కీలకమైన రహస్యాల్ని సంపాదించడంతో పాటు ఆ రెండు దేశాల్లో రష్యా స్పై నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడంలో పూర్తిగా విజయం సాధించింది. కేవలం మామూలు సేవకురాలిగా పని చేస్తూన్న ఆమె కొనసాగించిన గూఢచార కార్యకలాపాలు దిగ్భ్రాంతిని కలిగిస్తాయి. సమర్థురాలైన గూఢచారిణిగా ఆమెపేరు ఎప్పటికీ చెరిగిపోదన్నది మాత్రం నిజం. ●